క్రీడలకు అంతర్జాతీయ గుర్తింపు



ఘట్‌కేసర్‌: క్రీడలకు జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందని వీబీఐటీ చైర్మన్‌ గౌతంరావు అన్నారు. అవుషాపూర్‌ విజ్ఞాన భారతి ఇంజినీరింగ్‌ కళాశాల (వీబీఐటీ) వాలీబాల్‌ క్రీడాకారులను సోమవారం అభినందించారు. ఇటీవల ఎంఎల్‌ఆర్‌ ఇంజినీరింగ్‌ కళాశాలలో జరిగిన వాలీబాల్‌ స్టేట్‌ లెవల్‌ అంతర్‌ కళాశాలల వాలీబాల్‌ టోర్నీలో పురుషుల వాలీబాల్‌ జట్టు విజేతగా నిలించింది. ఈ సందర్భంగా క్రీడాకారులకు క్రీడల దుస్తులు, నగదు బహుమతి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలతో విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్‌ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ నీలిమ, ఫిజికల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ శ్రీనివాస్‌రెడ్డి, సహాయ పీడీలు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న చైర్మన్‌ కొండల్‌రెడ్డి

పోచారం: అన్నోజిగూడలోని ఎన్టీపీసీ చౌరస్తా నుంచి మోడీ రోడ్డు వరకు జరుగుతున్న బీటీ రోడ్డు పనులను చైర్మన్‌ కొండల్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మున్సిపల్‌ నిధుల నుంచి రూ. 30 లక్షలు, ప్రభుత్వ ప్రత్యేక నిధుల నుంచి రూ. 30 లక్షలు కేటాయించి బీటీ రోడ్డు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్‌ వీరారెడ్డి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కు అందజేత



కీసర: కరీంగూడ గ్రామానికి చెందిన దాసరి రాజేష్‌రెడ్డికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 60 వేల చెక్కును కాంగ్రెస్‌ పార్టీ మేడ్చల్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌ యాదవ్‌ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రిలీఫ్‌ ఫండ్‌ పేదలకు వరమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ కీసర మండల అధ్యక్షుడు కృష్ణ యాదవ్‌, మాజీ ఎంపీటీసీ ప్రవీణ్‌ కుమార్‌, సీనియర్‌ నాయకులు బాలరాజ్‌ యాదవ్‌, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతకు ఘన నివాళి



మేడ్చల్‌: మండల బీజేపీ సీనియర్‌ నాయకుడు కేశవరెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయనకు బీజేపీ, వివిధ పార్టీల నేతలు ఘనంగా నివాళులర్పించారు. అత్వెల్లిలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన వర్ధంతి సభలో నేతలు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, అర్బన్‌ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్‌ మోహన్‌రెడ్డి, నేతలు నందారెడ్డి, జగన్‌గౌడ్‌, రాఘవరెడ్డి, కేశవరెడ్డి కుమారుడు వంశీదీపక్‌రెడ్డి, వివిధ పార్టీల నేతలు మల్లేష్‌గౌడ్‌, కొండల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వార్డుల్లో మౌలిక వసతులు కల్పించాం



హైమాస్ట్‌ లైట్లను ప్రారంభిస్తున్న చైర్‌ పర్సన్‌

మేడ్చల్‌: పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించామని మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ దీపికా నర్సింహరెడ్డి అన్నారు. పట్టణంలోని 14వ వార్డులో ఏర్పాటు చేసిన హైమాస్ట్‌ లైట్లను కౌన్సిలర్‌ ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టణంలోని 23 వార్డులలో ప్రజలకు కావాల్సిన వీధి దీపాలు, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు వంటి పనులు 90 శాతం మేర పూర్తి చేశామని అన్నారు. లక్షల రూపాయల నిధులు వెచ్చించి మౌలిక వసతులు కల్పించామని మిగతా సౌకర్యాలు కల్పిస్తామన్నారు. సమావేశంలో కమిషనర్‌ నాగిరెడ్డి, కాలనీల వాసులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానా పరిశీలన



కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వికాస్‌నగర్‌లో బస్తీ దవాఖానాను చైర్మన్‌ కౌకుట్ల చంద్రారెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు, మందులు ఉండేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. బీపీ, షుగర్‌ ట్యాబ్లెట్లు ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్‌ మల్లేష్‌ యాదవ్‌, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

గౌతంనగర్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వ హయాంలోనే మల్కాజిగిరి నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని మల్కాజిగిరి బి-బ్లాక్‌ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్‌ అన్నారు. గౌతంనగర్‌ డివిజన్‌ పరిధిలోని ఓల్డ్‌ మిర్జాల్‌గూడ, రామాంజనేయనగర్‌ తదితర ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆయన సోమవారం కాంగ్రెస్‌ పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేష్‌ యాదవ్‌ మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సూచనల మేరకు గౌతంనగర్‌ డివిజన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించామన్నారు. కాంగ్రెస్‌ పార్టీ డివిజన్‌ అధ్యక్షులు వైనాల ప్రవీణ్‌కుమార్‌, నాయకులు ఫరీద్‌, పీపీ. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంధాభిషేకం





కీసర: కీసరగుట్టలోని భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం రెండో సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి గంధాభిషేకం కార్యక్రమాన్ని విశేషంగా నిర్వహించారు. మాజీ మంత్రి, మేడ్చల్‌ శాసన సభ్యుడు చామకూర మల్లారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని క్యూలైన్లు భక్తులతో కిక్కిరిశాయి. నగరంలోని నలుమూలల నుంచి భక్తులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్‌ తటాకం నాగలింగం, కార్యనిర్వహణాధికారి సుధాకర్‌రెడ్డి పర్యవేక్షించారు.



కుటుంబ సభ్యులతో కలిసి కార్తీకమాస పూజల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి



క్యూలైన్‌లలో భక్తజనం

కులగణన సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



మజీద్‌పూర్‌లో సర్వే పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్‌ శంకర్‌నాయక్‌



శామీర్‌పేట్‌: సమగ్ర ఇంటింటి కులగణన, కుటుంబ సర్వే సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్‌ శంకర్‌ నాయక్‌ అన్నారు. శామీర్‌పేట్‌ మండలం మజీద్‌పూర్‌ గ్రామంలో సర్వే తీరును సోమవారం పరిశీలించారు. సిబ్బంది సర్వే చేస్తున్న తీరు, ప్రజల నుంచి వస్తున్న స్పందన, సర్వేలో ఏ విధమైన సమస్యలు తలెత్తుతున్నాయి అనే అంశాలపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. సర్వేలో ఎలాంటి తప్పులు జరగకుండా పటిష్టంగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మమతబాయి, కార్యదర్శి వేణుగోపాల్‌, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న కులగణన సర్వే

మేడ్చల్‌: ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే మేడ్చల్‌ మున్సిపాలిటీ, మండలంలో సోమవారం చేపట్టారు. మున్సిపాలిటీలో 2400 ఇళ్లు, మండలంలో 1586 ఇళ్ల సర్వే పూర్తి చేసినట్లు, కులగణన సర్వేకు ప్రజలు సహకరిస్తున్నట్లు కమిషనర్‌ నాగిరెడ్డి, ఎంపీడీఓ వసంత లక్ష్మీ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

యూనియన్‌ బ్యాంక్‌ సేవలు మరువలేనివి



యూనియన్‌ బ్యాంకులో 106వ వార్షికోత్సవ వేడుకలు

ఘట్‌కేసర్‌: యూనియన్‌ బ్యాంక్‌ పేదలకు అందించిన సేవలు మరువలేనివని ఎఫ్‌ఎస్‌సీఎస్‌ డైరెక్టర్‌ రాంరెడ్డి అన్నారు. పట్టణంలోని యూనియన్‌ బ్యాంకులో సోమవారం నిర్వహించిన 106 వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూనియన్‌ బ్యాంకును 1919లో గాంధీ ప్రారంభించారని, 106 ఏళ్ల పాటు వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌సీఎస్‌ డైరెక్టర్‌ బాల్‌రాజ్‌యాదవ్‌, యూనియన్‌ బ్యాంకు చీఫ్‌ మేనేజర్‌ వివేక్‌కుమార్‌, ఎఫ్‌ఎస్‌సీఎస్‌ ఎండీ రాహుల్‌, క్రిసోలైట్‌, త్రివర్ణ, సంధ్య, రవికుమార్‌ పాల్గొన్నారు.

మెడికల్‌ ఆఫీసర్‌ విధుల నుంచి తొలగింపు



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లా గాజులరామారంలోని మోడల్‌ మార్కెట్‌ బస్తీ దవాఖానాలో మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ ప్రణీత్‌ను విధుల నుంచి తొలగించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించటంతో పాటు ఆయనలో బాధ్యత నిబద్ధత లోపించిందని జిల్లా వైద్యారోగ్యశాఖ పేర్కొంది. ఈ మేరకు సోమవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్‌. రఘునాథ్‌స్వామి ఆదేశాలు జారీ చేశారు. జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి ఆకస్మిక తనిఖీ నిర్వహించగా, డాక్టర్‌ ప్రణీత్‌ నియమిత సెలవుల మంజూరు లేకుండా గైర్హాజరు అయినట్లు గుర్తించినట్లు ఆదేశాల్లో పేర్కొన్నారు. అలాగే, సదరు దవాఖానాలో పరిపాలనా నియమాలు పాటించలేదని, నిర్లక్ష్యం కారణంగా రోగులకు, ముఖ్యంగా రెగ్యులర్‌ చెక్‌-అప్‌లతోపాటు డయాగ్నస్టిక్‌ కోసం వచ్చే రోగులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని తెలిపారు. ప్రజా ఆరోగ్యాన్ని కాపాడటంతోపాటు, నిరంతర వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ ప్రణీత్‌ను విధుల నుంచి తక్షణమే తొలగిస్తున్నట్టు ఆదేశాలు జారీ చేశారు.

పని చేయని వారికి హెచ్చరిక

మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లాలోని యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీలతోపాటు బస్తీ, పల్లె దవాఖానాల్లో పని చేస్తున్న మెడికల్‌ ఆఫీసర్లు, ఉద్యోగులు, సిబ్బంది వైద్య సేవల్లో ముఖ్యంగా విధుల నిర్వహణలో నిర్లక్ష్యంవహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్‌. రఘునాథ్‌స్వామి హెచ్చరించారు. డాక్టర్లు, సిబ్బందితోసహా అందరూ ప్రభుత్వ ఆదేశాలను ఖచ్చితంగా పాటించాలని డాక్టర్‌ రఘునాథ్‌స్వామి ఆదేశించారు. ప్రజలకు సేవల అందించడంలో ఏదైనా లోపం ఉంటే, సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఉద్యోగి సురేష్‌ మృతికి కలెక్టరేట్‌లో సంతాపం



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లా మత్స్యశాఖలో జూనియర్‌ అసిస్టెంట్‌గా పని చేస్తున్న సురేష్‌ ఆకస్మికంగా మృతి చెందటం పట్ల మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్‌ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌ మీటింగ్‌ హాల్‌లో ఉద్యోగి సురేష్‌ మృతికి వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులతో సహా సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌ ఏఓ రామ్‌ మోహన్‌ మాట్లాడుతూ.. సురేష్‌ చాల మంచి వ్యక్తి అని, తమ వృత్తి నిర్వహణలో మంచి పేరు సంపాదించుకున్నారన్నారు. వ్యక్తిగత ఇబ్బందులు, ఉద్యోగంలో ఒత్తిడి ఉన్నా తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. ఎప్పటికప్పుడు హెల్త్‌ చెకప్‌ చేయించుకుంటూ జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సివిల్‌ సప్లై జిల్లా జీఎం సుగుణ భాయి, సుకీర్త తదితరులు పాల్గొన్నారు.

నేడు కరెంట్‌ ఉండని ప్రాంతాలు

పోచారం: సింగపూర్‌ టౌన్‌షిప్‌లోని 33/11 కేవీ సబ్‌ స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టినందున మంగళవారం విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రదీప్‌ కుమార్‌ తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రాజీవ్‌ గృహకల్పలోని అన్ని బ్లాకులు, ఆర్‌ఎన్‌ఆర్‌ హైట్స్‌, మయూరి డెవలపర్స్‌, సాయినగర్‌, ఎమరాల్డ్‌ హైట్స్‌, అన్నోజిగూడ, సూర్యనగర్‌ ప్రాంతాలకు కరెంట్‌ ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మేడ్చల్‌: విద్యుత్‌ లైన్‌ల మరమ్మతుల కారణంగా మేడ్చల్‌ 33/11కేవీ సబ్‌ స్టేషన్‌, కంట్రీ క్లబ్‌ 1.11 కేవీ ఫీడర్‌ పరిధిలో మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల గంటల వరకు సాయిబాబానగర్‌, ఎయిర్‌ఫోర్స్‌ కాలనీ, వీకర్‌ సెక్షన్‌, స్టేషన్‌ రోడ్‌, సరస్వతి నగర్‌, సత్యనగర్‌, గిర్మాపూర్‌ రోడ్‌, మెట్రో లైన్‌ మార్క్‌ పరిధిలో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ రాంబాబు తెలిపారు.

అక్రమ కట్టడాలను ఉపేక్షించేదిలేదు


జవహర్‌నగర్‌: ప్రభుత్వ భూముల్లో వెలసిన అక్రమ కట్టడాలను ఉపేక్షించేదిలేదని, కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కాప్రా తహసీల్దార్‌ సుచరిత అన్నారు. జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌లోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాలను తహసీల్దార్‌ సుచరిత ఆధ్వర్యంలో సోమవారం రెవెన్యూ సిబ్బంది కూల్చివేతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రమేష్‌, వీరేంద్రసాయి, సిబ్బంది రవి తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య



సుభాష్‌ మృతదేహం

ఘట్‌కేసర్‌: సూసైడ్‌ నోట్‌ రాసి ఓ యువకుడు ఘట్‌కేసర్‌ పీఎస్‌ పరిధిలో ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ బాలాజీనగర్‌ గీతామందిర్‌ సమీపంలో నివసించే కనుకుర్తి సుభాష్‌ (24) కొండాపూర్‌లోని ఓ ట్యాబ్లెట్ల కంపెనీ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. సోమవారం పని ఉందని కుటుంబ సభ్యులకు చెప్పి కంపెనీకి వెళ్లకుండా ఇంటి దగ్గరే ఉండిపోయాడు. సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మరణించినట్లు తెలిపారు. కాగ నా చావును ఆత్మహత్యగా చెప్పొద్దని, సాధారణ మరణంగా చెప్పాలని సుభాష్‌ తన సూసైడ్‌ నోట్‌ల్‌ కోరాడు. చావు అనంతరం అంత్యక్రియలకు, నాన్‌వెజ్‌కు డబ్బు ఖర్చు చేయకూడదని, దగ్గరి బంధువులను మాత్రమే పిలవాలని, ఏడ్వకూడదని ప్రత్యేకంగా తల్లిని కోరాడు. మీరంటే నాకు ప్రేమ, కానీ జీవించడం నా వల్ల కావడం లేదు అందుకే చావును ఆపుకోలేక పోతున్నానని సూసైడ్‌ నోట్‌లో కోరాడు. పంచానామా అనంతరం శవాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



సుభాష్‌ రాసిన సూసైడ్‌ నోట్‌

కార్తీక మాస ప్రత్యేక పూజలు



ఎదులాబాద్‌లో పూజలందుకున్న స్వామివారు

ఘట్‌కేసర్‌: మున్సిపాలిటీలో కార్తీక మాసం రెండో సోమవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని లింగాలకుంట సయ్యంభూ నాగలింగేశ్వర స్వామి ఆలయం, శివారెడ్డిగూడ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం, ఎదులాబాద్‌ శివాలయంలో స్వామి వారికి పత్రి, విభూది, తులసి, పంచామృతంతో అర్చనలు, అభిషేకాలు చేశారు. తులసి కోటలు, ఆలయ ధ్వజస్తంభం ఎదుట కార్తీక మాసం దీపాలు వెలిగించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, శంకరప్ప, ఓం ప్రకాష్‌, చెన్నప్ప, లింగంముదిరాజ్‌, బాల్‌రాజ్‌ యాదవ్‌, యుగేందర్‌గౌడ్‌, రాంనాథ్‌, నరేష్‌, ఆలయ పూజారి శ్యామ్‌ కుమార్‌ శర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



శివాలయం ఆవరణలో అన్నదానం..

మౌలానా అబుల్‌ కలాం జయంతి వేడుకలు



కార్యక్రమంలో రిటైర్డ్‌ ప్రొఫెసర్‌, అధ్యాపకులు



జయంతి వేడుకల్లో మార్కెట్‌ కమిటీ చైర్మన్‌, నాయకులు

మేడ్చల్‌రూరల్‌: గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌సెట్‌లో సోమవారం జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దేశ మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్‌ కలాం ఆజాద్‌ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే జాతీయ విద్యా దినోత్సవంలో కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్‌ ప్రొఫెసర్‌ శ్రీనివాస్‌ రెడ్డి పాల్గొన్నారు. మౌలానా ఆజాద్‌కు నివాళులర్పించి అనంతరం తన ప్రసంగంలో జాతీయ విద్యా విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ నారాయణ, డీన్‌ రవికుమార్‌, ఎన్‌ఎస్‌ఎస్‌ పీఓ నాగరాజు నాయక్‌, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శామీర్‌పేట్‌: మూడుచింతలపల్లి మండలం జగ్గంగూడలోని మైనారిటీ రెసిడెన్షియల్‌ పాఠశాలలో సోమవారం దేశ మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్‌ కలాం ఆజాద్‌ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మేడ్చల్‌ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ నర్సింహులు యాదవ్‌, రాష్ట్ర మైనారిటీ హజ్‌ కమిటీ సభ్యులు మహ్మద్‌ ముజీబ్‌ ఉద్దీన్‌లు, ఉపాధ్యాయులు, నాయకులు మౌలానా చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థులు మౌలానా ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రవిందర్‌రెడ్డి, నాయకులు అఖిలేష్‌ రెడ్డి, రవిందర్‌ యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదగాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్‌ స్వప్న, ప్రిన్సిపాల్‌

మేడ్చల్‌రూరల్‌: ఎంబీఏ విద్యార్థులు ఉద్యోగాలు సాధించాలనే భావనను వీడి ఉద్యోగాలు కల్పించాలనే సంకల్పంతో ముందుకు సాగాలని, మంచి ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదగాలని స్కూల్‌ ఆఫ్‌ ఎంటర్‌ప్రైజ్‌ మేనేజ్‌మెంట్‌ ప్రోగ్రామ్‌ డైరెక్టర్‌ స్వప్న అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌సెట్‌ ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో ఎంఎస్‌ఎంఈ సహకారంతో 5 రోజుల పాటు నిర్వహించనున్న మేనేజ్‌మెంట్‌ డెవలప్‌మెంట్‌ ప్రోగ్రామ్‌(ఎండీపీ) సోమవారం జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఫైనాన్షియల్‌ లిటరసి ఫర్‌ అస్పైరింగ్‌ ఎంటర్‌ప్రెన్యూర్‌లో భాగంగా ఎంబీఏ విద్యార్థులకు చిన్నతరహా మరియు కుటీర పరిశ్రమలు, నూతన సంస్కరణలు, విధి విధాలనాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదగాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్‌ శ్రీనివాస్‌రావు, ఎంబీఏ డీన్‌ నవీన్‌కుమార్‌ మాట్లాడుతూ.. విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని కొత్త సంస్థలు నెలకొల్పాలని, ఉద్యోగాలు కల్పించే స్థాయికి చేరాలని కోరారు. కార్యక్రమంలో ప్రొఫెసర్‌ సతీష్‌, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయాల దర్శనానికి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు



చెంగిచెర్ల డిపో మేనేజర్‌ కవిత

ఘట్‌కేసర్‌: కార్తీకమాసం పురస్కరించుకొని ప్రసిద్ధఆలయాల దర్శనానికి చెంగిచెర్ల ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు చెంగిచెర్ల ఆర్టీసీ డిపో మేనేజర్‌ కవిత అన్నారు. ఘట్‌కేసర్‌ బస్‌స్టాండ్‌లో సోమవారం ఆమె మాట్లాడుతూ.. కార్తీక మాసంలో భక్తులు దైవ క్షేత్రాలను దర్శించుకోవడానికి దివ్యదర్శిని ప్యాకేజ్‌ టూర్‌ వెబ్‌సైట్‌లో టికెట్‌ బుక్‌ చేసుకోవచ్చన్నారు. చెంగిచెర్ల డిపో నుంచి ప్రతి శని, ఆదివారాలతో పాటు భక్తుల కోరితే సోమవారం కూడా నడిపిస్తామన్నారు. 35 మంది భక్తులు ఉంటే వారు కోరిన చోటుకు బస్సును పంపిస్తామన్నారు. ఉదయం 7 గంటలకు డిపో నుంచి ప్రారంభమై చీర్యాల్‌ లక్ష్మీనరసింహ ఆలయం, కీసటగుట్ట ఆలయం, రత్నాలయం, బద్రీనాథ్‌ ఆలయం, వర్గల్‌ సరస్వతి ఆలయం, కొమురవెల్లి, కొండపోచమ్మను దర్శించుకొని రాత్రి 8 గంటలకు చెంగిచెర్ల చేరుకుంటుందన్నారు. పెద్దలకు రూ. 500, పిల్లలకు రూ. 300 చెల్లించి ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పుణ్య పాదయాత్ర ప్రారంభం



పాదయాత్రలో భక్తులు

కీసర: కార్తీక మాసం సందర్భంగా పరమపూజ్య మహా ప్రేమావతార స్వయంభూ ఆది పరబ్రహ్మ మహాగురు జైమహావిభోశ్రీ దివ్యానుగ్రహంతో ఓమౌజయా ఏకోపాసన మహాధర్మం ఆధ్వర్యంలో సోమవారం పాదయాత్ర ప్రారంభమైంది. ఈ సందర్భంగా యాత్ర గురించి శ్రీభవతి క్షేత్రం నిర్వాహకులు పరమోజీ శ్రీరుషి ప్రజ్ఞానంద స్వామీజీ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం కార్తీక మాసంలో ఈ యాత్ర ఉంటుందన్నారు. మేడ్చల్‌ జిల్లా, కీసర మండలం, గోధుమకుంట గ్రామ పరిధిలోని కరీంగూడ ఓమౌజయా శ్రీభవతి క్షేత్రం నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలం, వెంకటాపూర్‌ గ్రామ శివారులోని ప్రజ్ఞా క్షేత్రం వరకు యాత్ర కొనసాగుతుందన్నారు. దాదాపు 150 మంది పాదయాత్రలో పాల్గొంటున్నారన్నారు. ప్రకృతితో పాటు మనుష్యుల్లో మంచి మార్పు కోసం యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు.